క్లుప్తంగా

అప్రమత్తత అవసరం



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సోహిణీ రాఘవ్

రేగిడి: వేసవి ప్రభావంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహిణి రాఘవ్ సూచించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణాలు చేయవద్దని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులను వీలైనంతవరకు ఇళ్లకే పరిమితం చేయాలన్నారు.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త



రేగిడిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

రేగిడి: సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రేగిడిలో సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోన్‌యాప్‌ల ద్వారా అప్పులిస్తామని నమ్మబలికి, మన బ్యాంక్ వివరాలు తెలుసుకుని నగదు కాజేస్తారని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత వివరాలు ఎవ్వరికీ చెప్పకూడదని సూచించారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



కొత్తస్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చకచకా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధి గాయత్రీ కాలనీ నుంచి పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ముందుగా కాలువలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం స్థానిక చీపురుపల్లి రోడ్డులో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు పాత స్తంభాల మార్చారు. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పొడుగునా స్తంభాల మార్పులు చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ కుమార్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఎస్ఈబీ సోదాలు



రైల్వేస్టేషన్ ఆవరణలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

బొబ్బిలి: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎస్ఈబీ సిబ్బంది శనివారం సోదాలు నిర్వహించారు. వివిధ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ద్వారా గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాల రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు ఈ తనిఖీలు చేస్తున్నామని ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. కొంతమంది ప్యాసింజర్ల లగేజీ బ్యాగులను చెక్ చేసి, మత్తుపదార్థాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం



కొత్తవలస పాఠశాలలో అడ్మిషన్లు చేయిస్తున్న ఎంఈఓ, తదితరులు

రాజాం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ఎంఈఓ పాండ్రంకి నాగయ్య తెలిపారు. మండలంలోని కొత్తవలస, పెనుబాక, తదితర గ్రామాల్లో శనివారం పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అడ్మిషన్లపై ఆరాతీశారు. పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్తవలసలో 30 కొత్త అడ్మిషన్లు చేయించడంతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కుదమ తిరుమలరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు

రాజాం: నగరంలోని ప్రతి వార్డులో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించడంతో పాటు నీటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని బాబానగర్, ఈశ్వరనారాయణకాలనీ, సారథి రోడ్డులలో శనివారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో శనివారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ప్రజల బాగోగుల కోసం ఆయన అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆయన అమలు చేస్తున్న పథకాలతో ప్రతీ ఇంట్లో ఎవరో ఒకరికి లబ్ధి జరుగుతోందన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమాన ప్రాధాన్యం ఇస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చారని, వీటితో పాటు సదస్సులు, సమావేశాలు, కార్యక్రమాల్లో ఇచ్చిన మరెన్నో హామీలను నెరవేర్చారన్నారు. ప్రజలకు ఆయన చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనెల ప్రకాశమ్మ, మయూరి అప్పలనాయుడు, మరడాన సింహాచలం, వడ్డి చిన్నారావు, వడ్డి జనార్దనరావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, లెంక రత్నాకర్‌నాయుడు, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దారు ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి

బొబ్బిలి: భారత మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని ఇందిరాగాంధీ డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న వారు పలువురికి ఆదర్శంగా ఉండాల్సిన స్థానంలో ఉండి, ఇటువంటి పనులు చేయడం సరికాదన్నారు. కేంద్రంలో అధికారంలోని బీజేపీ ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకోకుండా వెనకాడుతుండడం వెనక ఉన్న రహస్యమేంటని ప్రశ్నించారు. తప్పు చేసిన వారెవరైనా శిక్షణ అనుభవించాల్సిందేనని, అటువంటప్పుడే న్యాయంపై ప్రజలకు నమ్మకం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు మునకాల శ్రీనివాసరావు, ఏఐకేఎమ్ఎస్ నాయకులు లక్ష్మణరావు, సీఐటీయూ నాయకులు సురేష్‌కుమార్, తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకుడు మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' రేపు

రామభద్రపురం: మండల పరిధిలోని గొల్లపేటలో ఈ నెల 15, 16వ తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమామణి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆమె కోరారు.

తాగునీటిని వృథా చేయరాదు

రేగిడి: మండలంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ సూచించారు. మండలంలోని చిన్నశిర్లాం, వండానపేట, అక్కన్న అగ్రహారం, తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని గ్రామాలకు తాగునీటిని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా నీటిని విడిచిపెడుతున్నామని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

సంతకవిటి: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, టీఏ పి. వెంకటరమణ శనివారం పరిశీలించారు. బిల్లాణిలో అన్నరాయుడుచెరువు, తలతంపరలో నీలకోనేరు, శ్రీహరినాయుడుపేట శ్రీహరినాయుడు చెరువులలో జరుగుతున్న పనులను పరిశీలించి వేతనదారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మస్తర్లను పరిశీలించి, వేతనదారులతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ. 272 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

బాడంగి: మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని సీపీఎం నేత సురేష్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన మండలంలోని కోడూరు రెవెన్యూ పరిధిలో ఉన్న కంసాలబంద, నబ్బోడు గ్రామ చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని తెలిపారు. ఇదే విషయంలో అధికారులు జోక్యం చేసుకుని, ఆక్రమణలు తొలగించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై అలసత్వం తగదు



ఉంగరాడమెట్ట వద్ద జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ

- ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలపై అలసత్వం తగదని ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు, హౌసింగ్ ఏఈ ఎ. సూర్యప్రకాష్ సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో మోటార్లు ఏర్పాటు చేశారని, నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఇన్‌స్పెక్టర్లు బలగ శివ, ఎల్‌జీ, రేగిడి ఇంజినీరింగ్ అసిస్టెంట్ నందిని, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి, లైబ్రేరియన్ కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం సరఫరా చేస్తోందని, వాటిని క్రమం తప్పకుండా తీసుకుని, ఆరోగ్యవంతులుగా ఉండాలని తెలిపారు. అనంతరం పుస్తక పఠనం, చిత్రలేఖనం, కథలు చెప్పించడం, రాయించడం వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



తెర్లాం: కాగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ త్రినాధరావు కోరారు. మండలంలో పలు గ్రామాల్లోని పాఠశాలల్లో పదో తరగతి ఫెయిలైన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతులను శనివారం పరిశీలించిన ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థి పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో వారంతా ఉత్తర్ణత సాధించేలా కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు.

బాడంగి: స్థానిక ప్రభుత్వ, గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.రామదాసు కోరారు. శనివారం అక్కడి విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించిన ఆయన ప్రతీ విద్యార్థి పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



తెర్లాం: పణుకువలసలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ జగదీశ్వరరావు

తెర్లాం: ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి అని ఏపీఓ జగదీశ్వరరావు సూచించారు. శనివారం మండలంలోని కొరటాం, పణుకువలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనులు చేయాలని తెలిపారు. నిర్దేశిత కొలతల్లో చక్కగా పనిచేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

బాడంగి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయని, రోజుకు 6,500 వరకు వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని ఏపీఓ లక్ష్మీపతిరాజు తెలిపారు. మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడిన ఆయన రోజుకు రూ.257 వేతనం లభిస్తుండడంతో వేతనదారులు పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు.

చిన్నారుల ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష

రామభద్రపురం: వేసవి నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఏఎల్‌జీ శిరీష సూచించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ చిన్నికృష్ణతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆమె భానుడి ప్రతాపం వల్ల ఉష్ణోగ్రతలు తీవ్రతరమవుతున్నాయని, దీంతో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా మెలగకుంటే వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. జలుబు, జ్వరం బారినపడకుండా చూసుకోవాలన్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవాళ్లు ఎండలో తిరగకూడదన్నారు. ఏడాది లోపు పిల్లలకు వడగాల్పులు తగలకుండా చూడాలన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కారం

వంగర: మండల పరిధిలోని నిర్వాసిత గ్రామమైన పటువర్ధనం సమస్యలు పరిష్కరిస్తామని చీపురుపల్లి ఆర్డీఓ అప్పారావు తెలిపారు. శనివారం ఆయన గ్రామంలో పర్యటించి స్థానిక నాయకులు తెంటు జోగినాయుడు, నల్ల పరశురాంనాయుడులతో గ్రామ సమస్యలపై చర్చించారు. గ్రామ సమస్యపై వివిధ శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు మేలు చేయాలనే దృక్పథంతో వ్యవహరిస్తున్నారని, ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చారని పేర్కొన్నారు. వ్యవసాయం దండగ అని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు రైతులపై వల్లమాలిన ప్రేమ కనబరుస్తుండడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. తన సీటు కూడా గెలవలేని పవన్ కల్యాణ్ కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. టార్గెట్-175 లక్ష్యంగా అందరం పనిచేస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు సీఎం జగనన్న వెంటే ఉన్నారని, 2024 ఎన్నికల్లో పార్టీకి అఖండ మెజార్టీ ఇచ్చి, అధికారంలోకి తీసుకువస్తారన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలపాలిట వరం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



ఆదిలక్ష్మికి సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతోమంది పేదలు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. రేగిడి మండలం అంబకండి గ్రామానికి చెందిన గడిదేశి ఆదిలక్ష్మికి రూ. 60 వేల చెక్‌ను వైఎస్సార్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదిలక్ష్మి కుమార్తె మోక్షిత అనారోగ్యం బారిన పడడంతో వైద్యం చేయించడానికి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేశామన్నారు. దీంతో రూ. 60 వేలు మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పుర్లి గోపాలకృష్ణ, లావేటి గణపతి, లావేటి వేణు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- సీనియర్ సివిల్ జడ్జి బాబు



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

రాజాం సిటీ: లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్‌అదాలత్ తీర్పే అంతిమమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులతో పాటు రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు కూడా వాపసు పొందవచ్చన్నారు.

483 కేసుల పరిష్కారం....

ఈ సందర్భంగా నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 483 కేసులు సీనియర్ సివిల్ జడ్జి సమక్షంలో పరిష్కారమయ్యాయి. ఇందులో ఏడు సివిల్ కేసులు, 468 క్రిమినల్ కేసులు, 8 బీఎస్ఎన్ఎల్ ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయి. ఈ కేసులకు సంబంధించి రూ. 20,54,522 అపరాధ రుసుం విధించినట్లు జడ్జి జబాబు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.భవానీప్రసాద్, ఏపీపీ కిమిడి సూర్యకుమార్, సీఐలు కె.రవికుమార్, హెచ్.ఉపేంద్రరావు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1447 కేసుల పరిష్కారం

బొబ్బిలి: స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1447 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ తెలిపారు. కక్షిదారులంతా తమ శ్రమ, డబ్బులను వృథా చేసుకోకుండా కేసుల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. చెక్‌బౌన్స్, మనోవర్తి, ప్రి-లిటిగేషన్ వంటి కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు.

'అమృత్ సరోవర్'తో చెరువుల అభివృద్ధి

రేగిడి: అమృత్ సరోవర్ అభివృద్ధి పథకంలో భాగంగా గ్రామాల్లో ఉన్న తాగునీటి చెరువులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు, ఏపీఓ ఎస్.హరనాథ్ అన్నారు. మండలంలోని వన్నలి, ఉప్పరనాయుడువలస, లక్ష్మీపురం, తదితర గ్రామాల్లో ఉన్న తాగునీటి చెరువులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రూ. 10 లక్షల వ్యయంతో ఉపాధి వేతనదారులతో చెరువుల్లో పూడికలు తీయించడం, మట్టితో గట్లను బలపరచడం, మొక్కలు వేయడం, పార్కులు ఏర్పాటు చేయడం, తదితర పనులను చేపట్టనున్నామన్నారు. ఇప్పటికే మండలంలో గుళ్లపాడు, లింగాలవలస, ఉణుకూరు, నాయరాళ్లవలస గ్రామాల్లో చెరువులను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గార రమణ, కరణం గోవిందరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలి

రామభద్రపురం: వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని మండల వైద్యాధికారి దిలీప్‌కుమార్, ఏఎల్‌జీ శిరీష సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శనివారం మీడియాతో మాట్లాడిన వారు రోజురోజుకూ రోజువారీ నమోదయ్యే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, వీలైనంత వరకు ఎండ ఉన్నప్పుడు బయటకు వెళ్లకపోవడం మంచిదన్నారు. అత్యవసరమైనప్పుడు వెళ్తే తప్పనిసరిగా కాటన్ దుస్తులు ధరించి, గొడుగు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతిరోజూ మజ్జిగ, నిమ్మరసం తాగాలన్నారు. అనారోగ్య లక్షణాలతో ఎవరైనా బాధపడితే ఆస్పత్రిని ఆశ్రయించి, వైద్యసేవలు పొందాలని తెలిపారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు



కాగాంలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాధరావు

తెర్లాం: మనబడి నాడు-నేడు ఫేజ్-2 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ జె.త్రినాధరావు సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించిన ఆయన వేసవి సెలవులు పూర్తయ్యేల్లోగా నాడు-నేడు పనులను శతశాతం పూర్తి చేయాలని తెలిపారు.

హద్దురాళ్ల ఏర్పాటును వేగవంతం చేయాలి



సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ సుదర్శన దొర

బొబ్బిలి: భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో చేపడుతున్న హద్దురాళ్ల ఏర్పాటును వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ బి.సుదర్శన దొర సూచించారు. శనివారం మండలంలోని భూ బందరవలస, ఎంబన్నవలస గ్రామాల పొలాల్లో ఏర్పాటు చేస్తున్న హద్దురాళ్లను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని, తద్వారా రైతుల మధ్య భూ తగాదాలు రావన్నారు.